నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 8 ఫిబ్రవరి 2025 | VIKARABAD

ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేయాలి

లయోలా పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7 : బాలికపై లైంగిక దాడికి యత్నించిన లయోలా పాఠశాల అధినేత, ప్రిన్సిపాల్ దినావన్ రావును వెంటనే అరెస్టు చేసి పాఠశాల పర్మిషన్‌ను రద్దు చేయాలని శుక్రవారం ఆ స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థినిపై లైంగిక దాడికి యత్నించిన దినావన్‌రావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జిల్లా నాయకులు చరణ్, శ్రీకాంత్, విప్లవ్, వంశీ, తరంగ్ తదితరులున్నారు.

పది సెగ్మెంట్లలో ఉప ఎన్నికలు

అన్నిచోట్లా గులాబీ జెండా ఎగురవేస్తాం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి

మణికొండ 7: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల సెగ్మెంట్లలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని.. అన్ని చోట్లా గులాబీ జెండాను ఎగురవేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్ సర్కార్ 14 నెలల పాలనలోనే ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఓఆర్ఆర్ లోపలి మున్సిపాలిటీలు, కాలనీలు, గ్రామాల ప్రజలకు శాశ్వతంగా నీటి ఇబ్బందులు ఉండొద్దనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ రూ.3 వేల కోట్లతో రిజర్వాయర్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తే.. కాంగ్రెస్ సర్కారు వాటిని ప్రారంభించి తామే ఏర్పాటు చేశామని పేర్కొనడం సిగ్గుచేటన్నారు. రాజేంద్రనగర్ సెగ్మెంట్‌కు రావాల్సిన మెట్రో ప్రాజెక్టు తరలిపోయిందని, అందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆయన ఏమి ఆశించి అధికార పార్టీలో చేరారో ఇప్పటికీ ప్రజలకు చెప్పలేదని పేర్కొన్నారు.

రోటిబండతండావాసులతో మాట్లాడుతున్న అధికారులు, పోలీసులు

మీరు ఒప్పుకోకున్నా... భూములు తీసుకుంటాం..

అంగీకరిస్తే ఎకరానికి రూ.20 లక్షలిస్తాం.. లేదంటే రూ.6.75 లక్షలు కోర్టులో జమచేసి భూమిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

సీఎం సెగ్మెంట్‌లో ఆగని దాష్టీకం.. కేసుల భయంతో బిక్కుబిక్కుమంటున్న ఆ నాలుగు గ్రామాల ప్రజలు

లగచర్లతోపాటు మిగతా మూడు తండాల్లోనూ వేర్వేరుగా భూ సర్వే..

తమ భూముల జోలికి రావొద్దని ప్లకార్డులతో నిరసన తెలిపిన రోటిబండతండావాసులు

వందల సంఖ్యలో పోలీసులను మోహరించి భయభ్రాంతులకు గురిచేసిన ప్రభుత్వం

ఓటేసి గెలిపించుకున్న పాపానికి నెలలుగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని లగచర్లతోపాటు మిగతా మూడు తండాల ప్రజలు కన్నీరు పెడుతున్నారు. ఇటీవల లగచర్లలో జరిగిన పరిణామాలు..దాడులు.. కేసులు, అరెస్టులు తదితర ప్రభుత్వ దాష్టీకాల నుంచి ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న ఆ నాలుగు గ్రామాలపై శుక్రవారం మళ్లీ వందల సంఖ్యలో పోలీసులు, పదుల సంఖ్యలో అధికారులు విరుచుకుపడ్డారు. సర్వే పేరిట హడావిడి చేశారు. భూములు ఇవ్వాల్సిందేనని.. ఇవ్వకున్నా తాము తీసుకుని తీరుతామని తేల్చిచెప్పారు. తమ పొట్ట కొట్టొదని, తమ భూముల జోలికి రావొద్దని ప్లకార్డులతో గిరిజనులు వేడుకున్నా వారు పట్టించుకోలేదు. ఒక పక్క కేసుల భయం, మరోపక్క భూములు పోతాయన్న బాధ ఆ గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తున్నది.

గిరిజన రైతులకు అధికారుల బెదిరింపు..



తమ భూములను ప్రభుత్వానికి ఇచ్చేది లేదని రోటిబండతండాలో రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు

కొడంగల్, ఫిబ్రవరి 7 : లగచర్ల ఘటన జరిగిన దాదాపు రెండు నెలల తర్వాత మళ్లీ రైతుల గుండెల్లో సర్వే గుబులు మొదలైంది. శుక్రవారం రోటిబండతండా, పులిచెర్లకుంటతండా, లగచర్ల గ్రామాలకు సంబంధించి 110 ఎకరాల అసైన్డ్ భూమిలో అధికారులు భారీ పోలీసు బలగాల మధ్య సర్వే చేపట్టారు. రైతులను చెదరగొట్టేలా పోలీసులు, రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి ఒక్కో బృందం..ఒక్కో ప్రాంతంలో ఒకేసారి సర్వే చేపట్టింది. దీంతో రైతులు తమ భూములను కాపాడుకునేందుకు ఆ ప్రాంతాల్లోనే ఉండిపోయారు. కాగా అనుమతి తెలిపిన రైతులతో వారి వారి భూముల్లో అధికారులు సర్వే చేపట్టగా.. అనుమతించని రైతులను పంట పొలాల్లోకి కూడా రానివ్వలేదు. దీంతో రైతులు, పోలీసులకు మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకున్నది. రైతులు అంగీకరిస్తేనే ప్రభుత్వం భూములను తీసుకుంటుందని అధికారులు అన్నదాతలను మభ్యపెట్టారు. కానీ, వాస్తవానికి మూడు గ్రామాల్లో 110 ఎకరాల అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకునే దిశగానే ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వే కొనసాగింది. గతంలో జరిగిన ఘటనతో రైతులు కొంతవరకు భయాందోళనలో ఉండగా .. గిరిజన రైతులు తమకున్న కొద్దిపాటి పొలాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. రోటిబండతండాలో పలువురు గిరిజన రైతులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. సీఎం సారూ.. మా భూముల జోలికి రావొద్దు.. సర్వే పనులను వెంటనే నిలిపేయాలి.. పెట్టిన కేసులను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ.. తమ భూములను సర్కారుకు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పడంతో కొద్దిసేపు తండాలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. సమ్మతి తెలిపిన రైతుల నుంచి భూములను తీసుకుంటారో.. లేదో మీ ఇష్టమని .. తమ భూములను మాత్రం ఇచ్చేది లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గిరిజన రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చినప్పటి నుంచి తమకు బాధలు మొదలయ్యాయని.. కంటి కి నిద్ర, కడుపునకు కూడు లేని పరిస్థితి దాపురించిందన్నారు. భూములిచ్చేందుకు అంగీకరించిన రైతులకు ఎకరానికి రూ.20 లక్షలతోపాటు ఇంటిస్థలం, ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగం వంటి అవకాశాన్ని కల్పిస్తామని అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. అంగీకరించని రైతుల భూములను కూడా ప్రభుత్వం తీసుకుంటుందని.. వారికి ప్రభుత్వం ఆమోదించిన ధర మేరకు రూ. 6 లక్షల 75వేలు కోర్టులో జమ చేసి భూమిని తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దానితోపాటు ఎటువంటి ఇతర సౌకర్యాలు కల్పించే అవకాశం ఉండదన్నారు.

భూములు ఇచ్చేది లేదు..

- తెగేసి చెప్పిన ఫార్మా బాధిత రైతులు
- భూములివ్వాలని పలువురికి నోటీసులు పంపిన ప్రభుత్వం
- నేడు కలెక్టర్‌ను వ్యక్తిగతంగా కలువనున్న నోటీసులు అందుకున్న రైతులు

యాచారం, ఫిబ్రవరి 7 : ఫార్మాసిటీకి భూములు ఇచ్చేది లేదని మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన ఫార్మా బాధిత రైతులు తెగేసి చెప్పారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూములు ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం కొంతమంది రైతులకు నోటీసులు పంపించింది. వాటిని అందుకున్న సుమారు 250 మంది రైతులు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో నారాయణరెడ్డిని వ్యక్తిగతంగా కలువనున్నట్లు ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు గణేశ్ శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్లలో భారీగా తరలివస్తామన్నారు. ఫార్మాసిటీకి ఇవ్వని 2,200 ఎకరాల భూములను ప్రభుత్వానికి ఇచ్చేదిలేదని రైతులు స్పష్టం చేశారు. ఆ భూములకు సంబంధించి ఆన్‌లైన్ నుంచి టీఎస్ఐఐసీ పేరును తొలగించి రైతుల పేర్లను ఎంట్రీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా, రైతుబీమా, పంట రుణాలు, రుణమాఫీ తదితర సంక్షేమ పథకాలు రైతులకు వర్తించేలా చూడాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తామని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి సమన్వయ కర్తలు కవుల సరస్వతి, కుందారపు సత్యనారాయణ పేర్కొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

గొప్పలకు పోతున్నదెవరో ప్రజలకు తెలుసు

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

పదేండ్లు పక్కాగా ప్రగతి పనులు చేపట్టాం

కొందుర్గు, ఫిబ్రవరి 7 : బీఆర్ఎస్ హయాంలో షాద్‌నగర్ నియోజకవర్గంలో పదేండ్లు పక్కాగా ప్రగతి పనులు చేపట్టామని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ స్పష్టం చేశారు. అభివృద్ధిని విస్మరించి ప్రగల్భాలకు పోతున్నదెవరో ప్రజలకు తెలుసన్నారు. శుక్రవారం చౌదరిగూడ మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేండ్ల కాలంలో ప్రజలకు అవసరమైన అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్క దానిని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం కట్టించిన రైతు వేదికల్లో కాంగ్రెస్ నేతలు కూర్చొని కేసీఆర్, బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం చేస్తుంటే ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ నేతలకు చేతనైతే నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు అబ్దుల్ జబ్బార్, నర్సింగ్‌రావు, బాబురావు, సత్యాప్రమోదరావు, అజ్మీర్, సలం, పాండుయాదవ్, శేఖర్, నర్సింహులు, శ్రీను, సత్యం, వెంకటరాములు, జహంగీర్, అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియా బరితెగింపు..

రంగారెడ్డి జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న మట్టి అక్రమ తరలింపు

- రాత్రి అయిందటే రోడ్లపైకి వస్తున్న వందలాది లారీలు, టిప్పర్లు
- ఎలాంటి అనుమతుల్లేకుండానే రవాణా
- జిల్లాలో ముగ్గురికి మాత్రమే పర్మిషన్
- ప్రభుత్వ, అసైన్డ్ భూములను జేసీబీలు, హిటాచీలతో తవ్వుతున్న అక్రమార్కులు..లక్షలాది రూపాయల ఆర్జన
- ప్రభుత్వానికి ప్రతినెలా రూ. కోట్లలో ఆదాయానికి గండి
- మమ్మూళ్ల మత్తులో జోగుతున్న మైనింగ్ శాఖ అధికారులు
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటున్న జిల్లావాసులు

జిల్లాలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నది. ఎలాంటి అనుమతుల్లేకుండా రాత్రి అయిందటే చాలు వందలాది లారీలు, టిప్పర్లు రోడ్లపైకి వచ్చి హైదరాబాద్‌తోపాటు నగర శివారులోని పలు ప్రాంతాలకు యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నది. జిల్లా మైన్స్ కార్యాలయం నుంచి ముగ్గురికి మాత్రమే మట్టి తరలింపునకు అనుమతులుండగా.. జిల్లాలో వందలాది మంది ప్రభుత్వ భూములు, గుట్టలు, అసైన్డ్ భూములను జేసీబీలు, హిటాచీల సహాయంతో తవ్వుతూ మట్టి వ్యాపారం చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ దందా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లోని అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట, ఆదిబట్ల, తుర్కయాంజాల్, తుక్కుగూడ, శంషాబాద్, రాజేంద్రనగర్, కందుకూరు, ఆమనగల్లు, షాద్‌నగర్, కొత్తూరు, యాచారం, మంచాల తదితర ప్రాంతాల్లో జోరుగా సాగుతున్నది. ఇంత జరుగుతున్నా అటు మైనింగ్ అధికారులు ఇటు రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరుకాయలుగా సాగుతున్నది. మైనింగ్ మాఫియా ఇచ్చే మమ్మూళ్ల మత్తు లో వారు జోగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా ప్రతిరోజూ మట్టి అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వానికి రూ. కోటి నుంచి రూ. కోటీ యాభై లక్షల మేర నష్టం వాటిల్లుతున్నట్లు సమాచారం. ఈ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

-రంగారెడ్డి, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ)

ప్రతిరోజూ 300-400 ట్రిప్పుల మట్టి తరలింపు..!

జిల్లా నుంచి నగరంతోపాటు పలు ప్రాంతాలకు ప్రతిరోజూ 300-400 ట్రిప్పుల వరకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కొక్క ట్రిప్పునకు రూ. 4000- రూ. 5000 వరకు తీసుకుంటున్నారు. చిన్న టిప్పర్‌కు రూ. 4000 పెద్ద ట్రిప్పర్‌కు రూ. 5000 వసూలు చేస్తున్నారు. ఇలా ప్రతిరోజూ మట్టి అక్రమంగా తరలింపుతో రూ. కోటి నుంచి రూ. కోటీ యాభైలక్షల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. అక్రమార్కులు ప్రభుత్వ భూములు, గుట్టల నుంచే అక్రమంగా మట్టి దందాను నిర్వహిస్తున్నారు. ఈ మట్టిని ఎక్కువగా శివారులోని గృహ నిర్మాణాలు, భూముల చదును, వెంచర్లలో రోడ్లు వేసేందుకు పలువురు వినియోగిస్తున్నారు.

ఇబ్రహీంపట్నం సమీపంలోని ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా తరలించిన మట్టి

జిల్లాలో ముగ్గురికే అనుమతులు..

ప్రస్తుతం జిల్లాలో మట్టిని తరలించేందుకు ముగ్గురు మాత్రమే అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నట్లు సమాచారం. మహేశ్వరం మండలంలోని రావిర్యాల, కేశంపేట మండలంలో ఒక్కొక్కరు చొప్పున ఇద్దరు.. హయత్‌నగర్ మండలంలోని కొహెడలో మరొకరు ఉన్నారు. అనుమతులు తీసుకున్న వారు రోడ్లు ఇతరత్రా పనుల కోసం మట్టిని తీసుకెళ్తున్నారు. ఈ మట్టిని కూడా పట్టాభూముల నుంచే తరలిస్తున్నారు. ఇందుకు క్యూబిక్ మీటర్‌కు రూ. 41 చొప్పున ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. కానీ, జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా వందలాది మంది మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

వ్యాపారులు మట్టిని అక్రమంగా తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి రూ. కోట్లలో నష్టం వాటిల్లుతున్నది. ప్రభుత్వ, అసైన్డ్ భూములు, గుట్టలను జేసీబీలు, హిటాచీలతో తొలిచి మట్టిని వందలాది లారీలు, ట్రక్కుల ద్వారా యథేచ్ఛగా నగరంతోపాటు పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. మంచాల మండలంలోని ఆగాపల్లిలో మట్టి అక్రమ రవాణా గత నెల రోజులుగా రాత్రి పూట జరుగుతున్నదని స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే, ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ, ఇబ్రహీంపట్నం సమీపంలోని తట్టిఖానా వద్ద నుంచి కూడా గత నెల రోజులుగా రాత్రిపూట మట్టి దందా సాగుతున్నదని పలువురు పేర్కొంటున్నారు. ఉప్పరిగూడలో ఓ మట్టి వ్యాపారి తాను ఎమ్మెల్యే బంధువునని చెప్పుకొని ఈ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నాడు. ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ భూమి నుంచి గత నెలరోజులుగా మట్టిని తవ్వి ఇబ్రహీంపట్నంతోపాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

జిల్లాలో మట్టిని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ, పోలీసు అధికారుల సహాయంతో విస్తృతంగా దాడులు నిర్వహిస్తాం. మట్టిని తరలించే వారు సంబంధిత భూముల నిర్వాహకుల నుంచి అనుమతి పత్రాలు తీసుకొస్తే ప్రభుత్వం తరపున అనుమతులిస్తాం. అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు సంబంధిత యంత్రాలను సీజ్ చేస్తాం.

-నర్సింహారెడ్డి, జిల్లా మైనింగ్ అధికారి, రంగారెడ్డి